దామరచర్లలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం

• సర్వీస్ రోడ్డు వేసేదెన్నడో.. సమస్య తీరేదెప్పుడో..!

మండల కేంద్రంలోని త్రాగునీటి బోరు వెంట నిలిచిన మురుగునీరు

దామరచర్ల, మే 17: దామరచర్ల మండల కేంద్రంలో డ్రైనేజీవ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. రోడ్డు వెంట ఉన్న కాలనీల్లో డ్రైనేజీలు నిండి మురుగు నీరు రోడ్డు వెంట ప్రవహిస్తున్నాయి. మండల కేంద్రంలో నార్కట్‌పల్లి-అద్దంకి ప్రధాన రహదారి పూర్తయ్యి ఏండ్లు గడుస్తున్నా నేటి వరకు సర్వీసు రోడ్డు, డ్రైనేజీలు ఏర్పాటు చేయక పోవడంతో మురుగు కంపుకొడుతుంది. పరిశ్రమలు, వ్యాపారాలతో దినదినాభివృద్ధి చెందుతున్న క్రమంలో ప్రతి ఏడు నూతన గృహాలు అధికం అవుతున్నాయి. దానికి తగ్గట్టుగా డ్రైనేజీ వ్యవస్థ లేక పోవడంతో ఇబ్బందిగా మారింది. వర్షం పడితే చాలు నీరంతా ఇళ్లు, రోడ్డుపైకి పారుతుండడంతో కాలనీవాసులు అవస్థలు పడుతున్నారు.

ప్రస్తుతం మండల కేంద్రంలో కొత్తగా సీసీ రోడ్లు వేసినప్పటికీ డ్రైనేజీలు లేక పోవడంతో ఇబ్బందులు అధికమయ్యాయి. కొన్ని కాలనీల్లో డ్రైనేజీలు నిర్మాణం చేసినా అందులో నీరు ఎక్కడకు వెళ్లాలో తెలియక నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతుంది. అధికారులు స్పందించి వెంటనే డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

రోడ్డువెంట ఉన్న కాలనీలో ఇండ్ల ముందు నిలిచిన డ్రైనేజీ నీరు

23 నుంచి భగవత్ సప్తహం



శ్రీభగవత సప్తహం కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రవచకులు

రామగిరి, మే 17: నల్లగొండలో భగవత్ సప్తహం ఈనెల 23 నుంచి నిర్వహిస్తున్నట్లు ప్రముఖ ప్రవచకులు శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల రామకృష్ణమాచార్య వెల్లడించారు. ఈ మేరకు నల్లగొండలోని అక్కినపల్లి లక్ష్మణ్‌రావు, శ్రీదేవి నివాసంలో శుక్రవారం కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. అక్కినేపల్లి లక్ష్మణ్‌రావు స్వగృహ ప్రాంగణంలో జరిగే భగవత సప్తహం ఏడు రోజుల పాటు నాలుగు వేదాలు, శ్రీరామయణం, శ్రీమత్ భాగవతం, శ్రీవిష్ణుపురాణం దివ్య ప్రబంధం స్తోత్ర పారాయణం సాగుతాయన్నారు. పూజ కార్యక్రమాల్లో త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ స్వామి, అహోబిల రామానుజ జీయర్ స్వామి, త్రిదండి అష్టాక్షరీ జీయర్‌స్వామిలు హాజరై ప్రత్యేక్ష పర్యవేక్షణలో జరుగుతాయని వెల్లడించారు. కరపత్రాల ఆవిష్కరణలో కొమాండూరి రామ రంగాచార్యులు, చకిలం వేణుగోపాల్‌రావు, సుజాత, పద్మ, పద్మావతి, ప్రసాదరావు, సువర్ణ పాల్గొన్నారు.

వరద తాకిడికి కూలిన కల్వర్టు రక్షణ గోడ

ప్రమాదకరంగా కల్వర్టు

• భయాందోళనలో ప్రయాణికులు

కట్టంగూర్, మే 16 : మండలంలోని పరడ గ్రామ శివారులో చెరువు అలుగు వద్ద రహదారిపై నిర్మించిన కల్వర్టు ప్రమాదకరంగా మారింది. నాలుగేళ్ల క్రితం కురిసిన వర్షాలకు చెరవు అలుగు ద్వారా వెళ్లే వరదకు కల్వర్టుకు ఇరువైపుల ఉన్న సైడ్‌వాల్ తెగిపోయింది. నీటి ప్రవాహానికి కోతకు గురై పెద్ద రాళ్లు సైతం కొట్టుకుపోయాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు అధికారులు కనీసం మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కల్వర్టుపై వెళ్తున్న సమయంలో రెండు వాహనాలు ఎదురెదురుగా వచ్చిన సమయంలో ఎప్పుడు ఏప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రాత్రి సమయంలో వాహన దారులు ప్రాణాలు ఆరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సి వస్తాందని భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి కల్వర్టుకు మరమ్మతులు చేయించి రహదారికి ఇరువైపుల రక్షణగోడ నిర్మించాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ NAMASTHE TELANGANA CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, KANCHARLA SAMRAJYAM, W/o. Kancharla Srinivasa Reddy, R/o. H.No. 1-28/1, Gudur Village & Post, Miryalaguda, Nalgonda, T.S. I Changed My Name from KALLUTLA SAMRAJYAM to KANCHARLA SAMRAJYAM after Marriage. I henceforth be known as KANCHARLA SAMRAJYAM for all the purposes. NT-000000

SSC MEMO పోయినది

★ బొల్లెంపల్లి రమాదేవి, D/o. బొల్లెంపల్లి వెంకటయ్య యొక్క ఒరిజినల్ SSC MEMO (No: 1227109463) నల్లగొండ పట్టణంలో VT కాలనీ నుండి Hyd రోడ్‌కి బైక్‌పైన ప్రయాణిస్తుండగా పోయినది. దొరికినవారు సంప్ర: 9959585430. NT-000000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...

ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/- ప్రతి అదనపు లైన్‌కు 50/-

Note: 3+1 Scheme Available Minimum 4 Lines, Extra Line - Extra Amount 5% GST అదనం

నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.

నల్లగొండ : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059 | సూర్యాపేట : 9182777630 | భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059 | భోంగిర : 9182777196 | తొలుకట్ట : 9182777638

నీరు లేక బోసిపోయిన తుమ్మడం చిన్న చెరువు అలుగు

మూడు నెలల క్రితం అలుగు పోస్తున్న చెరువు అలుగు (ఫైల్)

అలుగుపై గల గల లేవి..?

• వట్టిపోయిన తుమ్మడం చిన్న చెరువు

నిడమనూరు, మే 17 : మండలంలోని తుమ్మడం చిన్న చెరువు నీళ్లు లేక వట్టిపోయింది. 2015 సంవత్సరంలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకంలో భాగంగా చెరువు పునరుద్ధరణ పనులు చేపట్టింది. దాంతో పదేండ్లు నిరంతరాయంగా ప్రవహిస్తూ అలుగు పోస్తూ చూపరులను ఆకర్షించేది. ఎడమ కాల్వకు నీటి విడుదల లేకపోవడం, వర్షాభావ పరిస్థితులు, చెరువు పరిధిలోని ఆయకట్టుకు చెరువు నీటిని తరలించడం వంటి కారణాల దృష్ట్యా చెరువు ఖాళీ అయ్యి అలుగు వెలవెలబోతున్నది. పదేండ్లుగా నిర్విరామంగా అలుగు మీదుగా దుంకి నీటి గలగలలు నేడు కానరాకపోవడం ఇక్కడ గమనార్హం.

అలుగు పోస్తూ కళ కళలాడిన అలుగు పదేళ్ల అనంతరం ఐదు నెలలుగా నీరు లేకపోవడంతో కళావిహీనమైంది.

ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తులు

దామరచర్ల, మే 17: మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలికల ఆశ్రమ కళాశాలలో ఇంటర్‌లో ప్రవేశానికి అడ్మిషన్లు ఈనెల 25న ప్రారంభం అవుతాయని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరానికి ఇంటర్‌మీడియట్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో చేరే విద్యార్థులు బాలురు, బాలికలు 25న ఉదయం 9 గంటలకు మిర్యాలగూడ మండలం అవంతీపురంలో జరిగే స్పాట్ అడ్మిషన్లకు హాజరుకావాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ విద్యార్థులకు మార్చి-2024 పదో తరగతిలో సాధించిన జీపీఏ ప్రాతిపదికన అడ్మిషన్లు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతో పాటుగా రెండుజతల జిరాక్స్ ప్రతులను తీసుకరావాలని సూచించారు.

మోడల్ స్కూళ్లలో ప్రవేశానికి..

నాంపల్లి/ శాలిగౌరారం : తెలంగాణ మోడల్ స్కూళలో ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని నాంపల్లి, శాలిగౌరారం ప్రిన్సిపాళ్లు కవిత, రాగిణి శుక్రవారం వేర్వేరు ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బాలికలకు హాస్టల్ వసతి, ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉన్నట్లు పేర్కొన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరానికి సంబంధించి ఎంపీసీ, బైపీసీ, సీఈసీ ప్రతి గ్రూపులలో 40 సీట్లు ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈనెల 31 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

రైతులు భూసార పరీక్ష చేయించుకోవాలి

మునుగోడు, మే 17: రైతులందరూ భూసార పరీక్ష చేయించుకోవాలని ఏఈఓ మాదగోని నర్సింహగౌడ్ అన్నారు. మండలంలోని పులిపలుపుల క్లస్టర్ పరిధిలోని రైతులకు రైతు వేదికలో భూసార పరీక్షలో భాగంగా మట్టి నమూనా సేకరించే విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షలు చేయడంతో పోషకాలు పరిమాణం కాకుండా, భూమిలోని చౌడు, సున్నం శాతాన్ని గుర్తించవచ్చన్నారు. రైతులు రసాయానికి ఎరువులు తగ్గించి సేంద్రియ వ్యవసాయం వైపు దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు సుధాకర్, మల్లయ్య, దామోదర్, ముత్తయ్య, నర్సింహ, స్వామి పాల్గొన్నారు.

సబ్సిడీపై విత్తనాలు

చిట్యాల, మే 17 : నేలను సారవంతం చేసే పచ్చి రొట్టె విత్తనాలైన జీలుగ, జనుము విత్తనాలు సబ్సిడీపై రైతులకు అందుబాటులో ఉన్నాయని ఏఓ గిరిబాబు తెలిపారు. సబ్సిడీ పోను జీలుగ రూ. 1,116, జనుము రూ. 1,448లకు అందజేయనున్నట్లు తెలిపారు. చిట్యాల పీఏసీఎస్ కార్యాలయంలో ఈ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని రైతులు పట్టాదారు పాసుపుస్తకము, ఆధార్ కార్డు జిరాక్స్‌లు తీసుకువచ్చి తీసుకోని వెళ్లవచ్చునని ఆయన తెలిపాడు.

తేనే టీగల దాడిలో మున్సిపల్ సిబ్బందికి గాయాలు

చిట్యాల, మే 17 : మున్సిపాలిటీ పరిధిలో శివనేనిగూడెంలో శుక్రవారం విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ సిబ్బంది జిట్ట మణేమ్మ, రుద్రవరం ఆండాలు తేనే టీగల దాడిలో గాయపడ్డారు. ఉదయాన్నే వీరు పనులు చేస్తుండగా ఒక్కసారిగా తేనే టీగలు చుట్టిముట్టాయి. మున్సిపల్ వైస్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి, జిట్ట నగేశ్ తదితరులు గాయపడిన వారిని పరామర్శించారు.

నర్సింగ్ విద్యార్థిని అనుమానాస్పద స్థితి మృతి

సింధుజ (ఫైల్)

మిర్యాలగూడ, మే 17 : మండలంలోని ఊట్లపల్లి గ్రామానికి చెందిన సింధుజ(17) శుక్రవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సింధుజ నల్లగొండలోని నర్సింగ్ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతున్నది. వేసవి సెలవులు కావడంతో ఇంటి వద్ద ఉంటుంది. తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన దేశబోయిన యశ్వంత్‌తో కొంతకాలంగా సన్నిహితంగా ఉంటుంది. మూడ్రోజులుగా ఇద్దరి మధ్య ఫోన్‌లో గొడవ జరుగడంతో సింధుజ యశ్వంత్ ఫోన్‌నంబర్‌ను బ్లాక్ చేసింది. దాంతో యశ్వంత్ శుక్రవారం గ్రామానికి వచ్చి బాలికను నిలదీసినట్లు తెలిసింది. కొంత సమయంతరువాత బాలిక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం అందించగా మిర్యాలగూడ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. సింధుజ తండ్రి గతంలో మృతిచెందగా తల్లితో కలిసి ఉంటుంది. ఆమె కూడా శుక్రవారం ఉదయం ఉపాధి హామీ పనులకు వెళ్లిన సమయంలో ఈ సంఘటన జరిగింది. బాలిక మృతదేహాన్ని డీఎస్పీ రాజశేఖర్‌రాజు పరిశీలించారు .మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ నరేశ్ తెలిపారు.

ఉపాధి హామీ కూలీ మృతి

అడవిదేవులపల్లి, మే 17: మండలంలోని బంగారికుంట గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ కూలీకి వెళ్లి పని చేస్తుండగా అస్వస్థతకు గురై మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే శుక్రవారం ఉదయం 10.30 గంటల సమయంలో చింతచెట్టుతండా గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పనికి కుర్రచాంప్లి(59) పని చేస్తుండగా కళ్లు తిరుగుతున్నాయని తన తోటి కూలీలతో చెప్పారు. వారు అడవిదేవులపల్లిలోని ఆర్ఎంపీ వద్ద చూపించగా బీపీ తక్కువగా ఉందని మెరుగైన చికిత్స కోసం మిర్యాలగూడకు తరలిస్తుండగా మార్గమధ్యంలో చనిపోయినట్లు స్థానికులు తెలిపారు. ఆమెకు ముగ్గురు కుమారులు ఉన్నట్లు తెలిపారు.

అధ్వానంగా మదారిగూడెం మేజర్ కాల్వ

• చెత్తా చెదారంతో నింపుతున్న స్థానికులు • మరో పక్క ఆక్రమణ • పట్టించుకోని అధికారులు

మురుగుకూపంగా మారిన మదారిగూడెం మేజర్ కాల్వ

హాలియా, మే 17 : హాలియా గుండా ప్రవహించే మదారిగూడెం మేజర్ పంట కాల్వ మురుగు కాల్వను తలపిస్తుంది. ఇండ్ల నుంచి వచ్చే వ్యర్థాలతో పాటు చేపలపొట్టు, చికెన్ వ్యర్థం అంతా ఈ డ్రైనేజీ కాల్వలోనే వేస్తుండడంతో మురుగు కాల్వను తలపిస్తుంది. గతంలో బీఆర్ఎస్ పాలనలో మదారిగూడెం మేజర్ కాల్వపై ఇరువైపులా గోడలు కట్టి పై కప్పు వేసి కూరగాయల మార్కెట్ నిర్వహించాలని భావించారు. కానీ దురదృష్టవశాత్తు నోముల నర్సింహయ్య మరణం తరువాత ఈ కాల్వపై గురించి అంతా మరిచిపోయారు. మేజర్ కాల్వలో చెత్తచెదారం, ఇంట్లో నుంచి వ్యర్థజలాలు ఈ మేజర్ కాల్వలో కలవడంతో దోమలకు ఆవాసయోగ్యంగా మారింది. మదారిగూడెం మేజర్ కాల్వకు ఇరువైపులా ఉన్న రోడ్డు ఇరుగుపొరుగు వారు ఆక్రమించుకోవడంతో మేజర్ కాల్వకు ఒక వైపు మాత్రమే ప్రయాణించడానికి వీలుంది. ఎన్ఎస్‌పీ అధికారులు సైతం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. మున్సిపల్ అధికారులు, పాలకవర్గం పట్టించుకోకపోతే మేజర్ కాల్వ సైతం అక్రమణకు గురైయ్యే అవకాశం ఉంది. అధికారులు స్పందించి మేజర్ కాల్వకు యుద్ధ ప్రాతిపదికన కాల్వలో వ్యర్థాలను తొలగించి, ఆక్రమణకు గురైన స్థలాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవాలని, కాల్వకు ఇరువైపులా ఉన్న రోడ్డును పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

చిట్యాల, మే 17 : మండలంలోని వెల్మినేడు శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందినట్లు ఎస్ఐ సైదాబాబు తెలిపారు. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన సురేంద్ర కుమార్(23),ప్రమోద్(20), పంకజ్ ఓ లేబర్ కాంట్రాక్టర్ వద్ద పనిచేస్తుంటారు. వీరు ముగ్గురు శుక్రవారం ఉదయం బైక్‌పై వెలిమినేడు నుంచి చౌటుప్పల్ సమీపంలోని శ్రీని ఫార్మా కంపెనీలో పనిచేయడానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో సుర్కంటి గూడెం శివారులో జాతీయ రహదారి పక్కన నిలిపి ఉన్న డీసీఎంను వీరు వెనుక వైపు నుంచి ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో సురేంద్ర కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు.

మిగిలిన ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం చౌటుప్పల్ లోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి డాక్టర్ల సలహా మేరకు హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యంలో ప్రమోద్ మరణించాడు. సురేంద్రకుమార్ సోదరుడు సంత్‌లాల్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ వివరించారు.

పిల్లలు పుట్టడం లేదని మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

పార్వతి(ఫైల్)

మాడ్గులపల్లి, మే 17: మండలంలోని పాములపాడు గ్రామానికి పార్వతి(30) చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందింది. వేములపల్లి ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పాములపాడు గ్రామానికి చెందిన సంకినాల కరుణాకర్, పార్వతికి 2012 లో వివాహం జరిగింది. వారికి సంతానం కలుగకపోవడంతో పలు ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నా ఫలితం లేక పోయింది. దాంతో మనస్తాపం చెందిన పార్వతి ఏప్రిల్ 26న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. స్థానికులు భర్తకు సమాచారం అందించడంతో ఆయన వెంటనే పార్వతిని సూర్యాపేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించి అనంతరం బంధువులకు అప్పగించినట్లు తెలిపారు. మృతురాలి భర్త కరుణాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

టీ పీసీసీ అధ్యక్ష పదవి బీసీలకు ఇవ్వాలి : జాజుల లింగంగౌడ్

మిర్యాలగూడ, మే 17: టీపీసీసీ అధ్యక్ష పదవి బీసీలకు ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ కాంగ్రెస్ అధిష్టానాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన స్థానికంగా మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఎమ్మెల్యే, ఎంపీ టికెట్ల విషయంలో తీరని అన్యాయం చేశారని, ఇప్పటికే అగ్రకులాలకు సీఎం పదవి, ఎస్సీలకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చారని, 55శాతం ఉన్న బీసీలకు ఖచ్చితంగా టీపీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలన్నారు. స్వాతంత్ర్యం అనంతరం రాజకీయ అధికారాన్ని అగ్రవర్ణాలు అనుభవిస్తూ సహజ వనరులను గుప్పిట్లో పెట్టుకోని సమాజంపై ఆధిపత్యం చేలాయిస్తున్నారని, సమర్థవంతంగా పనిచేస్తున్న బీసీ నేతలను ప్రజాధరణ పొందితే ఎక్కడ ముఖ్యంత్రి అవుతారేమోననే భయంతో అవినీతి ముద్ర వేసి తొలగిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ అధిష్టానం ఆలోచించి టీపీసీసీ అధ్యక్ష పదవిని బీసీలకు కేటాయించాలన్నారు.

బియ్యపు గింజలపై లక్ష్మీనృసింహస్వామి నామం

బియ్యపు గింజలపై లక్ష్మీనృసింహస్వామి నామాలు రాస్తున్న గేయవర్షిణి

మిర్యాలగూడ, మే 17: మిర్యాలగూడ పట్టణంలోని రెడ్డికాలనీకి చెందిన గుంటూరు గేయవర్షిణి మట్టపల్లి లక్ష్మీనృసింహస్వామి నామాలను 27,116 బియ్యపు గింజలపై రాసింది. ఈనెల 21న జరగనున్న స్వామి కల్యాణ వేడుకల్లో స్వామివారి నామాల బియ్యపు గింజలను సమర్పించేందుకు గేయవర్షిణి 41రోజులుగా దీక్షగా కూర్చొని నామాలు రాసింది. గేయవర్షిణి స్థానికంగా ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. సంక్రాంతి రోజు ప్రారంభించి సెలవురోజుల్లో ఉపవాసం ఉంటూ బియ్యపు గింజలపై స్వామివారి నామాలు రాయడం ప్రారంభించి శుక్రవారం రోజు పూర్తి చేసింది.

చిత్రలేఖనంపై అవగాహన

అవగాహన కల్పిస్తున్న నర్సింహ

చిట్యాల, మే 17 :మండలంలోని గుండ్రాంపల్లి గ్రంథాలయం సమాచార కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా ప్రముఖ సాహితీవేత్త ఏభూషి నరసింహ తెలుగు భాష గొప్పదనాన్ని వివరించారు. చిత్రలేఖనంపై అవగాహన కల్పించి, చిత్రాలు ఏలా వేయాలో నేర్పించాడు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ అనుముల శ్రీనివాస, బాల చిత్రకారిణి గరిషె కీర్తి, గరిషె అంజయ్య పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

శ్రీనివాసుకు ఆర్థిక సాయం అందిస్తున్న అసోసియేషన్ సభ్యులు

దేవరకొండ రూరల్, మే 17 : దేవరకొండ పట్టణానికి చెందిన ఏశాల శ్రీనివాసులు మూడు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయాలు కావడంతో హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. దాదాపు రూ.15 లక్షలు వరకు ఖర్చు కావడం ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాడు. విషయం తెలుసుకున్న దేవరకొండలోని హెల్పింగ్ హ్యాండ్ అసోసియేషన్ రూ.15 వేలు శ్రీనివాస్‌కు అందజేశారు. కార్యక్రమంలో అన్వేష్‌రెడ్డి, కేస నరేశ్, రమేశ్, అంజి, శివ తదితరులు పాల్గొన్నారు.

నర్రా ప్రవీణ్ రెడ్డికి ఓయూ డాక్టరేట్

ప్రవీణ్ రెడ్డి

నార్కట్‌పల్లి, మే 17: ప్రముఖ కవి, రచయిత, నవలాకారుడు నర్రా ప్రవీణ్ రెడ్డికి ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రకటించింది. నార్కట్‌పల్లికి చెందిన నర్రా రాంరెడ్డి, వెంకటలక్ష్మి, కుమారుడైన ప్రవీణ్ రెడ్డి ఉస్మానియా విశ్వవిద్యాలయ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రఘు పర్యవేక్షణలో 'ఏనుగు నర్సింహారెడ్డి సాహిత్యం సమగ్ర అధ్యయనం' అనే అంశంపై సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించి డాక్టరేట్ పొందాడు. డాక్టరేట్ డిగ్రీని పొందిన ప్రవీణ్ రెడ్డిని పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య, ఎంవీ గోనారెడ్డి, వేణు సంకోజు అభినందనలు తెలిపారు. తండు కృష్ణకౌండిన్య, బెల్లి యాదయ్య, రాకేశ్, భవాని, నరసింహ, అంజయ్య, హసీనా, అభినయ, శ్రీనివాస్, కూరెళ్ల శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు.



జంకుతండాలో తాగునీటి బోరును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

• మిర్యాలగూడ ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ, మే 17: గ్రామాల్లోతాగునీటి సమస్య పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి తెలిపారు. మండలంలోని జంకుతండాలో తాగునీటి బోరును శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. వేసవిలో గ్రామస్థుల దాహార్తిని తీర్చేందుకుగాను చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాము కాటుతో మాజీ వార్డు సభ్యుడి మృతి

నార్కట్‌పల్లి, మే 17: మండలకేంద్రంలో శుక్రవారం పాము కాటుతో వ్యక్తి మృతి చెందాడు. పట్టణానికి చెందిన చేపూరి రాజు(40) మాజీ వార్డు సభ్యుడు, నల్లగొండ రోడ్డు సమీపంలో సిమెంట్ బ్రిక్స్ పనులు చేసి భోజనం అనంతరం సేద తీరుతుండగా పాము కాటు వేసింది. చుట్టూ ఉన్న కూలీలు అరుపులు వేశారు. చికిత్స నిమిత్తం కామినేనికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు.

రేషన్ బియ్యం పట్టివేత

పెద్దవూర, మే 17 : మండలంలోని తెప్పలమడుగు సమీపంలో సుమారు 300 క్వింటాల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్ఐ పి.వీరాబాబు తెలిపారు. టాస్క్‌ఫోర్స్ నల్లగొండ వారు అందించిన సమాచారం మేరకు గ్రామ శివారులో గల అమ్మ రైస్ మిల్‌లో సోదా నిర్వహించగా సుమారు 745 బస్తాల్లో బియ్యం, లారీలో కొంత రేషన్ స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. సివిల్ సప్లయ్ అధికారులకు తెలుపడంతో వారు పంచనామా నిర్వహించి లారీ, బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత

శాలిగౌరారం, మే 17: మండలంలోని ఊట్కూర్ గ్రామానికి చెందిన వేముల వీరస్వామి తండ్రి చిన్న లింగయ్య ఇటీవల మృతి చెందాడు. మండలంలోని మాధారం కలాన్ గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 2006-07 సంవత్సరంలో వీరస్వామితో పాటు పదోతరగతి పూర్తి చేసిన విద్యార్థులు రూ.11 వేలు, అలాగే ఏడో తరగతి చదువుకున్న విద్యార్థులు రూ.4 వేలు పోగు చేసి మొత్తంగా రూ.15వేలు వీరస్వామికి అందజేశారు. కార్యక్రమంలో మామిడి శ్రీను అశోక్, రమేశ్, సతీశ్, నరేశ్, వేముల క్రాంతి, సందీప్, నవీన్, వెంకన్న ఉన్నారు.

విద్యుత్ తీగలు తగిలి బర్రెలు మృతి

కేతేపల్లి, మే 17 : తెగిపడిన విద్యుత్ తీగలు తగిలి ఐదు బర్రెలు మరణించిన సంఘటన కొత్తపేట గ్రామంలో శుక్రవారం జరిగింది. బాధిత రైతు దాసరి సునీత, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సునీత 6 బర్రెలు రోజు మాదిరిగానే మేతకు వెళ్లాయి. గురువారం రాత్రి వీచిన ఈదురు గాలులకు గ్రామశివారులోని మూసీ కుడి కాల్వ సమీపంలోని వాగు వెంట విద్యుత్ తీగలు తెగిపడి ఉన్నాయి. తీగలు మేత మేస్తున్న ఐదు బర్రెలకు తగలడంతో అక్కడికక్కడే మరణించాయి. ఒక బర్రె తీగలు తెగిన ప్రదేశానికి దూరంగా వెళ్లడంతో ప్రాణాలతో బయటపడింది. బర్రెల విలువ రూ.4 లక్షల వరకు ఉంటుందని బాధ